క్లుప్తంగా

ఆర్‌సీఎం చర్చిలో క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఫాదర్ మాణిక్యం, సంఘ పెద్దలు

మధురపూడి: కోరుకొండ ఎస్సార్ నగర్‌లోని ఆర్‌సీఎం చర్చిలో ఆదివారం 2025 క్యాలెండర్‌ను రెవరెండ్ ఫాదర్ మాణిక్యం ఆవిష్కరించారు. ఏసుక్రీస్తు బాప్తిజం తీసుకున్న పండగ సందర్భంగా క్యాలెండర్‌ను ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉపదేసి బెల్లపు డేవిడ్, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయ స్వామి ఉత్సవం



దోసకాయలపల్లిలో ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న ప్రముఖులు

మధురపూడి: కోరుకొండ మండలం దోసకాయలపల్లి గ్రామంలో ఆదివారం ఆంజనేయ స్వామి ఉత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా భారీ అన్న సమారాధన జరిగింది. తొలుత లైబ్రరీ సెంటర్‌లోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

నేటి నుంచి దోసాలమ్మ వారి సంక్రాంతి ఉత్సవాలు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు గ్రామ దేవత దోసాలమ్మ అమ్మవారి సంక్రాంతి ఉత్సవాలు సోమవారం నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13వ తేదీ భోగి రోజున అమ్మవారికి ప్రత్యేక పూజలు, సాయంత్రం భజన, 14వ తేదీ సంక్రాంతి రోజున ప్రత్యేక పూజలు, సాయంత్రం కచేరి, 15వ తేదీ కనుమ రోజున ఉదయం అమ్మవారి పంచలోహ విగ్రహం ఉయ్యాల సేవ, సాయంత్రం ఐదు గంటల నుంచి అమ్మవారి పంచలోహ విగ్రహానికి భారీ ఊరేగింపు జరుగుతుందని వివరించారు. 16వ తేదీ ముక్కనుమ రోజున భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించుకోవచ్చన్నారు. 26వ తేదీన భారీ అన్న సమారాధన జరుగుతుందని తెలిపారు.

అట్టహాసంగా సంక్రాంతి నంది పురస్కారాల ప్రదానం

ప్రకాశం నగర్: భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం సంక్రాంతి సంబరాలు, నంది పురస్కారాల కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. గత 11 ఏళ్లుగా కళా రంగంలో విశేష కృషి చేస్తున్న 300 మందికి పైగా ప్రతిభ కలిగిన కళాకారులను అకాడమీ అధ్యక్షురాలు లయన్ లాలితారావు, ఇతర సభ్యులు నంది పురస్కారాలతో సన్మానించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖులు భాగవతుల మోహన్‌రావు, బి.సత్యనారాయణమూర్తి, తోట సుబ్బారావు, సప్ప దుర్గప్రసాద్, పసుమర్తి శ్రీనివాసశర్మ, అడ్డాల నాగేశ్వరరావు, అనిత అతిథులుగా హాజరయ్యారు. పలువురు కళాకారులు చేసిన నృత్య అభినయం ప్రేక్షకులను అలరించింది. రాయప్రోలు రాధ, పద్మజ, పద్మలత, కె.ప్రమీల, లక్ష్మి తదితరులు నంది పురస్కారాలను అందుకున్న వారిలో ఉన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం

రాజమహేంద్రవరం రూరల్: కరాటే ఆత్మరక్షణకు దోహదపడుతుందని హుకుంపేట సొసైటీ మాజీ ఉపాధ్యక్షుడు తెల్లమేకల సూర్యకృష్ణ అన్నారు. ఆదివారం పిడింగొయ్యి గ్రామంలో కరాటే కోచ్ పంచికట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న చిన్నారులకు రూ.7 వేల విలువ చేసే నాన్‌సాక్స్, కరాటే కిట్లను తెల్లమేకల సూర్యకృష్ణ, మణి దంపతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచికట్ల ఉమామహేశ్వరరావు పి.లక్ష్మీలావణ్య, జి.నాగదుర్గతేజ తదితరులు పాల్గొన్నారు.



హరిదాసుకు బియ్యం పోస్తూ..



చిన్నారులకు భోగిపండ్లు వేసి, ఆశీస్సులందజేస్తున్న పెద్దలు



డూడూ బసవన్నల సందడి

మస్తుగా.. ముందస్తుగా..



భోగి మంట చుట్టూ తిరుగుతున్న విద్యార్థులు

- స్కూళ్లు, కాలేజీల్లో సంక్రాంతి సందడి
- సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన
- ఆకట్టుకున్న భోగి మంటలు, డూడూ బసవన్నలు
- వివిధ వేషధారణల్లో చిన్నారులు

రాజానగరం: సంక్రాంతి అంటేనే ఆనందాల పండగ. నియోజకవర్గంలోని పలు స్కూళ్లు, కాలేజీల్లో సంక్రాంతి పండగ సందడి ముందుగానే వచ్చేసింది. మన సంస్కృతి, సంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహన కలిగించడంలో భాగంగా, వివిధ పర్వదినాల సమయంలో కూడా అనేక కార్యక్రమాలను ఆయా పండగల రీతిలోనే ముందస్తుగా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో నియోజకవర్గంలోని పలు స్కూళ్లు, కాలేజీల్లో రెండు, మూడు రోజుల ముందుగానే సంక్రాంతి పండగను సంప్రదాయబద్ధంగా నిర్వహించి, విద్యార్థులను వాటిలో భాగస్వాములను చేశారు.

నెల రోజుల ముందు నుంచే..

సాధారణంగా సంక్రాంతి పండగంటే నెల రోజుల పాటు సంప్రదాయబద్ధంగా, తెలుగు సంస్కృతికి ప్రతిబింబంగా జరిగే పెద్ద పండగ. మార్గశిర మాసం ప్రారంభం నుంచి నెలపట్టుట ద్వారా సంక్రాంతి సందడి ప్రారంభమవుతుంది. ఈ నెల రోజులు గ్రామాల్లో సంచరించే హరిదాసు, గంగిరెద్దు ఆటలు, కొమ్ము దొర, పిట్టల దొర, ఇలా రకరకాల కళాకారుల వేషధారణలతో విద్యార్థులను తయారు చేసి, వాటిపై అవగాహన కలిగించే ప్రయత్నం చేశారు. అలాగే ఆటల పోటీలు, రంగవల్లుల పోటీలు కూడా నిర్వహించి, విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. భోగి మంట వేసి, చిన్నారులకు భోగి పండ్లు, గొబ్బెమ్మలను పెట్టి చుట్టూ తిరుగుతూ, పాడుతూ, పోస్తూ వాటి ప్రాశస్త్యాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులను ధరించి కనువిందు చేశారు.

స్కూళ్లు, కాలేజీల్లో..

మండలంలోని దివాన్‌చెరువు శ్రీప్రకాష్ విద్యా నికేతన్‌లో నిజంగా సంక్రాంతి పండగే వచ్చిందా అన్నట్టుగా వాతావరణం దర్శనమిచ్చింది. విద్యార్థులు సంప్రదాయ దుస్తులను ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలవగా, చిన్నారులకు పెద్దలు భోగి పండ్లు పోసి ఆశీస్సులందజేశారు. యువతతో గొబ్బెమ్మలను పెట్టించి, ఆటలాడారు. హరిదాసు సంకీర్తనలతో సందడి చేయగా, డూడూ బసవన్నలతో పాటు, జంగమ దేవర, సోదిమ్మలు సందడి చేశారు.

అలాగే స్థానికంగా ఉన్న దివ్య విద్యా సంస్థల ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. కానవరంలోని గాయత్రీ విద్యా సంస్థల్లోను మూడు రోజుల సంక్రాంతి పండగ అంటే ఎలా ఉంటుందో చేసి చేసి చూపించారు. భోగి మంట వేసి, చుట్టూ తిరుగుతూ కేరింతలు కొట్టారు. స్థానిక హర్షవర్ధన స్కూలులో చిన్నారులకు భోగి పండు వేసి, ఆటపాటలతో ఎంజాయ్ చేశారు. రంగవల్లుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే దివాన్‌చెరువులోని ఓక్‌వుడ్‌లోను విద్యార్థులు ముందస్తు సంక్రాంతి సందడి చేశారు.



గొబ్బెమ్మలను పెట్టి, పాటలు పాడుతూ..



సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు

పిల్లలకు అవగాహన కోసమే..



మన సంస్కృతి, సంప్రదాయాలపై పిల్లలకు చిన్నతనం నుంచే అవగాహన కల్పించాలి. ముఖ్యంగా విద్యార్థులకు చదువుతో పాటు, పండగలపై కూడా అవగాహన ఉంటేనే రాబోయే కాలంలో వీటి మనుగడ ఉంటుంది. లేకుంటే ఆధునికత మోజులో పడి, సంప్రదాయాలు, సంస్కృతి, పండగలు కూడా మరుగునపడే అవకాశం ఉంది.

– సోమశేఖర వరప్రసాద్, ఉపాధ్యాయుడు

ఉత్సాహంగా రంగవల్లుల పోటీలు

రాజానగరం: సంక్రాంతి పండగ సందర్భంగా స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాల ప్రాంగణంలో హెబిటేట్ రెస్టారెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన రంగవల్లుల పోటీలకు విశేష స్పందన వచ్చింది. రాజానగరం, రంగంపేట, రాజమహేంద్రవరం, కొవ్వూరు, భీమవరం, పాలకొల్లు, నర్సాపురాల నుంచి 98 మంది మహిళలు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. సంక్రాంతి సందడిని ప్రతిబింబించే రీతిలో రకరకాల మోడళ్లలో వేసిన రంగురంగుల ముగ్గులు ఒకదానికి మరొకటి పోటీనిచ్చే రీతిలో ఉండటంతో, విజేతలను ఎంపిక చేయడానికి న్యాయనిర్ణేతలకు కష్టమైంది. తొలి మూడు బహుమతులు రాజమహేంద్రవరం వాసులనే వరించాయి. ప్రథమ బహుమతి రూ.80 వేల విలువైన వెండి హారాన్ని చిక్కాల సృజన, ద్వితీయ బహుమతి రూ.40 వేల విలువైన వెండి హారాన్ని ముళ్లపూడి లలిత, తృతీయ బహుమతి రూ.20 వేల విలువైన వెండి హారాన్ని జి.రత్నశ్రీకు జీఎస్ఎల్ సంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు అందజేశారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన మరో ఏడుగురికి ప్రోత్సాహక బహుమతులు అందజేశామని హెబిటేట్ డైరెక్టర్ హరీష్ తెలిపారు.



ప్రథమ బహుమతి వచ్చిన ముగ్గు



విజేతలకు అందజేసిన బహుమతులు

అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు

లా అండ్ ఆర్డర్ అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు

సీతానగరం: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని లా అండ్ ఆర్డర్ అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు హెచ్చరించారు. ఆదివారం సీతానగరం పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. మండలంలో కోడిపందాల బరులపై ఆరా తీసి, పలు ప్రాంతాలను ఆయన పరిశీలించారు. కోడిపందాలు, పేకాట, జూదాలు, గుండాట, అశ్లీల నృత్యాలు వంటివి నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సంక్రాంతి పండగ మూడు రోజులూ మంచి సంప్రదాయ పద్ధతిలో, శాంతియుత వాతావరణంలో పండగ జరుపుకోవాలని కోరారు. సామాజిక మాధ్యమాల్లో ఉచిత రీచార్జ్‌ల పేరుతో వస్తున్న సందేశాల లింకులను తెరవవద్దని సూచించారు. వాటి వలన బ్యాంక్ ఖాతాలో నగదు నష్టపోయే అవకాశాలు ఉన్నాయన్నారు. సైబర్ నేరాలకు పాల్పడే వారితో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. అనంతరం పోలీస్ సిబ్బందికి పండగ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విధులపై పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఆయన వెంట ఎస్సై డి.రామ్‌కుమార్ ఉన్నారు.



సీతానగరం పోలీస్ స్టేషన్‌లో సిబ్బందికి సూచనలు ఇస్తున్న అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

రాజానగరం: సంక్రాంతి పండగ సందర్భంగా ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని, వాటిని ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని సీఐ ఎస్‌పీ వీరయ్యగౌడ్ ఆదివారం ఇక్కడ హెచ్చరించారు. పండగ పేరుతో కోడి పందాలు, పేకాట, గుండాట, వంటి వాటిని ఆడటం, అశ్లీల నృత్య ప్రదర్శనలు ఇవ్వడం నేరమన్నారు. అలాగే పండగ సందర్భంగా, ఇతర కారణాలతో ఇళ్లకు తాళాలు వేసి, గ్రామాంతరాలు వెళ్లేవారు ముందుగా తమకు సమాచారమిస్తే, ఆయా ప్రాంతాలలో గట్టి నిఘాను ఏర్పాటు చేస్తామన్నారు. వారి ఇళ్లకు రక్షణ కల్పిస్తామని చెప్పారు. ఈ మేరకు గ్రామాల్లో ఆటోలో మైకుల ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నారు.

వివేకానందుడిని యువత స్ఫూర్తిగా తీసుకోవాలి



రాజానగరం జెడ్పీ హైస్కూల్‌లో వివేకానందుని విగ్రహానికి నివాళులర్పిస్తున్న పూర్వ విద్యార్థులు



అనపర్తిలో వివేకనందుని విగ్రహం వద్ద అధ్యాపకులు, విద్యార్థులు

రాజానగరం: స్వామి వివేకానంద జయంతిని ఆదివారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఇదే పాఠశాలలో 2013, 2014ల్లో టెన్త్ చదివిన కొంతమంది విద్యార్థులు స్థానిక వివేకానంద యూత్ ఆర్గనైజేషన్‌తో కలిసి పాఠశాల ఆవరణలో స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. దేశానికి ఆయన అందించిన సేవలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు చవ్వా చరణ్‌గుప్త, అరట్ల హరీష్, బల్ల అవినాష్, బైరెత్తి సాయిచందు, మత్తుర్తి సత్య, ఆకాశపు ఈశ్వరి, పసలపూడి కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుని జీవితం యువతకు ఆదర్శం

పెదపూడి: మానవ సేవే మాధవసేవ అనే సూక్తిని యువత అనుసరించాలని అనపర్తి జీబీఆర్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌పీ.అబ్బాయిరెడ్డి అన్నారు. అనపర్తిలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజన ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులు సమీపంలోని వివేకానందుని కాంస్య విగ్రహం వద్ద ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ పీఆర్ఎల్ స్వామి, కోఆర్డినేటర్ సీహెచ్ ఆనందరావు, కెమిస్ట్రీ అధ్యాపకుడు పీ.సోమశేఖర్, అనపర్తి శ్రీ రామకృష్ణ సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

సంప్రదాయాలను కాపాడుకుందాం

బిక్కవోలు: సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎస్సై వాసంశెట్టి రవి చంద్రకుమార్ అన్నారు. ఆదివారం సంక్రాంతి పండగను పురస్కరించుకుని బిక్కవోలు గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన బ్యాడ్మింటన్, వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సంక్రాంతి పండగలో కోడి పందెలు, గుండాట వంటి ఆటలను ఆడకుండా సంప్రదాయాలను కాపాడుకునే ఆటలు ఆడాలన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం వద్ద బ్యాడ్మింటన్ పోటీలు, ఎంపీపీ ఇంగ్లీషు మీడియం స్కూల్ వద్ద వాలీబాల్ పోటీలు నిర్వహించారు. గెలిపొందిన విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పీడీ ఘనకొండ ధనరాజ్, మాజీ వైస్ ఎంపీపీ చింతా శ్రీనివాసరెడ్డి, పల్లె వాసు, పందలపాక ఉప సర్పంచి పడాల వెంకటరామారెడ్డి, తొస్సిపూడి డీసీసీ చైర్మన్ కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, ఉపాధ్యాయుడు జంగా శ్రీనివాస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



బిక్కవోలులో క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్సై రవిచంద్ర కుమార్

ఘనంగా ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆవిర్భావ దినం

పెదపూడి: మండలంలోని సంపర గ్రామంలో సంపర ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 162వ జయంత్యుత్సవాలతో పాటు సంపర ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.సంపర ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు వడ్డీ వెంకటేశ్వర్లు వివేకానందుని చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలోని 14 ఉన్నత పాఠశాలల విద్యార్థులకు విద్యా విషయ పోటీలు నిర్వహించారు. నగదు బహుమతులను విద్యార్థులకు అందజేశారు. ఉన్నత పాఠశాల నిర్మాణం కోసం శ్రమించిన 20 మంది తాపీ మేస్త్రీలకు బహుమానాలు అందజేశారు. సంక్రాంతి పండగ సందర్భంగా 25 కుటుంబాల పేదలకు మిఠాయిలు, బట్టలు పంపిణీ చేశారు. 20 ఏళ్ల క్రిందట ఆంధ్రా బ్యాంక్ మేనేజర్‌గా పనిచేసే రిటైర్ అయిన ఆకెళ్ల సుబ్బారాయుడు దంపతులను అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. కోనసీమ జిల్లా నుంచి ఎం నాగార్జునను గణిత అవధాన సామ్రాట్ అనే బిరుదుతో సత్కరించారు. మండల విద్యా శాఖాధికారి సీవీవీ సత్యనారాయణ, గ్రామ పెద్దలు తిబిరిశెట్టి ఆదినారాయణ, తిబిరిశెట్టి చిన్నారి, మండల లైన్స్ క్లబ్ ప్రెసిడెంట్ మండ రాజారెడ్డి, స్వచ్ఛంద సేవకులు వైవి ప్రసాద్, సంపర ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సంపర ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు

బరి తెగింపు

- ఊరూరా కోడి పందేల బరులు
- గుండాట, పేకాటలకు ప్రత్యేక ఏర్పాట్లు

రంగంపేట: కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్న పోలీసుల హెచ్చరికలను సవాల్ చేస్తూ నిర్వాహకులు పందెం బరులు సిద్ధం చేస్తున్నారు. మండలం వ్యాప్తంగా దాదాపు ప్రతి గ్రామంలోనూ బరులు ఏర్పాట్లు చేస్తున్నారు. పేకాట, గుండాట తదితర జూద కార్యకలాపాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో పండగ మూడు రోజులు జూద క్రీడల ద్వారా లక్షలాది రూపాయలు చేతులు మారతాయని పలువురు విశ్లేషిస్తున్నారు.

వినకుంటే చర్యలు తప్పవు

సంక్రాంతి పండగ ముసుగులో కోడి పందేలు, గుండాట, పేకాట ఇతర అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తోట కృష్ణసాయి హెచ్చరించారు. మండల కేంద్రమైన రంగంపేటలో కోడి పందేలు నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన టెంట్‌లు, ఇతర సామాగ్రిని ఆదివారం సాయంత్రం ఎస్ఐ కృష్ణసాయి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ధ్వంసం చేశారు. ఎస్ఐ కృష్ణసాయి మాట్లాడుతూ కోడి పందేలు, గుండాట, పేకాట ఇతర అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చట్టపరంగా కఠిన శిక్షలు అమల్లో ఉన్నాయని ఆ సెక్షన్లలో ఇరుక్కొని జీవితాలను పాడు చేసుకోవద్దన్నారు. కోడి పందేల నిర్వాహకులు, టెంట్‌లు ఇచ్చేవారు, స్థల యజమానుల పైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



రంగంపేటలో బరులు ధ్వంసం చేస్తున్న పోలీసులు

ఇంటింటా.. ఘుమఘుమలు

- పల్లెల్లో మొదలైన సంక్రాంతి సందడి
- పిండి వంటల తయారీలో మహిళల నిమగ్నం
- ఇళ్లలో చేసుకోలేని వారి కోసం మార్కెట్లోనూ లభ్యం

బిక్కవోలు: తెలుగు వారి పెద్ద పండగ సంక్రాంతి. ఏ పండగకు లేని విశిష్టత ఈ పండగ సొంతం. పేద, ధనిక తేడా లేకుండా మూడు రోజుల పాటు పండగను ఘనంగా జరుపుకొంటారు. సంక్రాంతి సమీపించడంతో సంప్రదాయ పిండి వంటల తయారీలో మహిళలు నిమగ్నమయ్యారు. పిండి వంటల ఘుమ ఘుమలతో తెలుగు లోగిళ్లు గుబాళిస్తున్నాయి. పిండి వంటలను తాము తినడంతో పాటు బంధువులకు పంపుతుంటారు. అరిసెల తయారీలో మగవారు తమ వంతు సహకారం అందిస్తున్నారు. ఇళ్లల్లో పిండి వంటలు చేసుకోలేని వారికి మార్కెట్లో ఇన్ స్టెంట్ పదార్థాలు లభ్యమవుతున్నాయి. కొత్త అల్లుళ్లకు వారెవ్వా అనిపించే పసందైన విందు లభిస్తుంది.



పందలపాకలో పిండి వంటలు చేస్తున్న మహిళలు



కొంకుదురులో జంతికల తయారీలో నిమగ్నమైన మహిళలు

సంక్రాంతి స్పెషల్ అరిసెలు, చికినాలు

సంక్రాంతి అనగానే నోరూరించే అరిసెలు, చికినాలు గుర్తుకొస్తాయి. ఇతర పిండి వంటలను ఎప్పుడైనా చేస్తారు. కానీ అరిసెలు మాత్రం సంక్రాంతి స్పెషల్. వీటిని రుచి చూడాలంటే సంకాంత్రి ఎప్పుడొస్తుందా అని ఎదురు చూడాల్సిందే. అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలంలోని గ్రామాల్లో ఏ ఇంట చూసినా పిండివంటల తయారీలో మహిళలు నిమగ్నమై ఉన్నారు.

దొడ్డిగుంటలో నేడు సంక్రాంతి సంబరాలు

రంగంపేట: మండల పరిధిలోని దొడ్డిగుంట గ్రామంలో సోమవారం నుంచి సంక్రాంతి సంబరాలు ప్రారంభమవుతాయని స్మైల్ ఫౌండేషన్ అధినేత కొండేపూడి ధనరాజ్ తెలిపారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక డాక్టర్ అబ్దుల్ కలాం కళా ప్రాంగణంలో భోగి, సంక్రాంతి పండగలను పురస్కరించుకుని ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మహిళలకు ముగ్గులు, నృత్యాలు, పిండి వంటలు, అందాల పాపలు, స్లో సైక్లింగ్ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయన్నారు. పోటీలలో విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. సంబరాల్లో అంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.